సీసీఐ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

• ఎమ్మెల్యే బాలూనాయక్

సీసీఐ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలూనాయక్

మాల్/పెద్దఆడిశర్లపల్లి, అక్టోబర్ 16: పత్తిసాగు చేసిన రైతులు సీసీఐ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అన్నారు. బుధవారం చింతపల్లి మండలంలోని శివ సాయి కాటన్ జిన్నింగ్ మిల్లులో, గుడిపల్లి మండలంలోని చిలుకమర్రి గ్రామ పరిధిలోని తిరుమల కాటన్ జిన్నింగ్ మిల్లు వద్ద ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా పత్తి కొనుగోలు చేయాలని కోరారు. పత్తికి మద్దతు ధర అందించాలని రైతులు ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో మాల్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దొంతం అలివేలూ సంజీవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, నాయకులు హరినాయక్, వెంకటయ్య, కాయితి జితేందర్‌రెడ్డి, ఎం.యాదగిరి, వెంకటయ్య, శ్రీనివాస్ యాదవ్, పీఏపల్లిలో మార్కెట్ కమిటీ చైర్మన్ జమున సిరాజ్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఎల్లయ్య, నాయకులు గోవర్దన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, సతీశ్‌రెడ్డి, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, చంద్రారెడ్డి, అర్వపల్లి నరసింహ, మార్కెట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

• డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

శాలిగౌరారం : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శేఖర్‌రెడ్డి

శాలిగౌరారం, అక్టోబర్ 16 : ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తమ ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని డీఆర్‌డీఓ శేఖర్ రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని బైరవునిబండ, ఎన్జీకొత్తపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి తేమ లేకుండా చేసి కేంద్రానికి తీసుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి, డీపీఎం మోహన్‌రెడ్డి, ఏఓ సౌమ్యశృతి, మాజీ సర్పంచులు దండ రేణుకాఅశోక్‌రెడ్డి, ఒగోటి పార్వతమ్మ, ఏపీఎం జానకి, ఏపీఓ జంగమ్మ, ఈసీ వెంకటాచారి, ఏఈఓ వీరేశ్, సీసీలు నోముల చంద్రయ్య, తాటిపాముల సైదులు, శంకర్, సిర్పంగి బాలకృష్ణ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు

మర్రిగూడ : మండలంలోని శివన్నగూడెం సహకార సంఘం పరిధిలోని ఖుదాభక్ష్‌పల్లి, శివన్నగూడెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ బాలం నర్సింహ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో తాసీల్దార్ బక్క శ్రీనివాస్, ఏఓ హేమలత, వైస్ చైర్మన్ రంగినేని యాదగిరిరావు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

నల్లగొండ రూరల్ : మండలంలోని అనంతారంలో హాకా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం నల్లగొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వజ్జ సత్యనారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో హాకా డీఎం కోటయ్య, కేంద్రం ఇన్‌చార్జి నూల కోటేశ్, విజయ్ పాల్గొన్నారు.

విషజ్వరాలపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

• డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్

రోగులతో మాట్లాడి వారికి అందే చికిత్స వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్

కేతేపల్లి, అక్టోబర్ 16 : విషజ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి, ఆస్పత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శ్రీనివాస్ ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవసరమైన సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, మండల వైద్యాధికారి డాక్టర్ అర్చన, వైద్య సిబ్బంది ఉన్నారు.

గ్రామపంచాయతీ రికార్డుల మాయంపై డీపీఓ విచారణ

చండూరు,అక్టోబర్ 16: చండూరు గ్రామ పంచాయతీకి సంబంధించిన రికార్డులు మాయమైన విషయమై బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు విచారణ చేపట్టారు. రికార్డులు మాయమైన విషయమై చండూరు రైతు సేవా సహకార సంఘం డైరెక్టర్ కట్ట భిక్షం ఇచ్చిన ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై చండూరు మండలం ఇడికూడ గ్రామ కార్యదర్శి(ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్నాడు) అంబటి సైదులు, గట్టుప్పల కార్యదర్శి ఎండీ.షఫి, మునుగోడు మండలం కొరటికల్ కార్యదర్శి ఎస్.వెంకటేశ్వర్లు విచారణకు రావాలని జిల్లా పంచాయతీ అధికారి ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. అయితే సైదులు, షఫి మాత్రమే విచారణకు హాజరవగా వెంకటేశ్వర్లు అనారోగ్య కారణాలతో రాలేదు. వీరు కూడా ఎలాంటి రికార్డులు తీసుకు రాలేదు. ఈ విషయమై కార్యదర్శులను అధికారి ప్రశ్నించగా తమకంటే ముందు పనిచేసిన కార్యదర్శులు కేవలం బీరువా తాళం చెవి మాత్రమే ఇచ్చారని, ఎలాంటి రికార్డులు ఇవ్వలేదని సమాధానం ఇచ్చారు. ఈ విషయమై నిర్వహించిన విచారణకు సంబంధించిన విషయాలపై జిల్లా పంచాయతీ అధికారికి నివేదిక అందిస్తామని డీపీఓ తెలిపారు.

పేద విద్యార్థికి ఎన్‌ఆర్‌ఐ చేయూత

అశ్వినికి డీడీ అందిస్తున్న విద్యాసాగర్‌రెడ్డి

కొండమల్లేపల్లి, అక్టోబర్ 16 : మండల కేంద్రానికి చెందిన కూరాకుల అశ్విని పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తి చేసింది. ఇసెట్‌లో ర్యాంకు సాధించడంతో హైదరాబాద్‌లోని సీబీఐటీ ఇంజినీరింగ్ కాలేజీలో సీఎస్సీలో సీటు వచ్చింది. అయితే ఆమె హాస్టల్ ఫీజు చెల్లించలేక తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతుండడంతో స్థానిక జడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయుడు శ్రీపతిరావు విషయాన్ని ఎన్‌ఆర్‌ఐ పిన్నపురెడ్డి విద్యాసార్‌రెడ్డికి తెలిపారు. స్పందించిన ఆయన బుధవారం అశ్వినికి రూ.60 వేల డీడీని అందించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

PLOT FOR SALE
★గజం: 2,500/- నార్కెట్‌పల్లి దగ్గర గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో స్విమ్మింగ్ పూల్, కాటేజీ, 30 పండ్ల మొక్కలు, 30 ఎర్రచందనం మొక్కలతో 5 & 10 గుంటల ప్లాట్స్ అమ్మబడును. దసరా ఆఫర్ 10 గ్రా. గోల్డ్ కలదు. 6304222202.
NT-338782

ఫైనాన్స్ కావలెను
★Finance కావలెను: నల్గొండ జిల్లా, మిర్యాలగూడ మండలం వద్ద 4 ఎకరాల 27 గుంటల వ్యవసాయ భూమిపై ఫైనాన్స్ కావలెను. ల్యాండ్ మార్ట్‌గేజ్ చేయబడును. 8341350089 / 8978645313.
NT-331786

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు :
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777196 | చౌటుప్పల్ : 9182777638

దీపావళికి ముందే రుణమాఫీ పూర్తి చేస్తాం

• మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు
• నిడమనూరు, హాలియా మార్కెట్ కమిటీల ప్రమాణ స్వీకారం

నిడమనూరు : ప్రమాణ స్వీకారం చేస్తున్న మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, వేదికపై మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి

నిడమనూరు, అక్టోబర్16 : రేషన్ కార్డులు లేని రైతులకు దీపావళికి ముందే రుణమాఫీ సొమ్మును వారి ఖాతాల్లో జమ చేస్తామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బాలాజీ గార్డెన్స్ ఫంక్షన్‌హాల్లో సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 22 లక్షల మంది రైతులకు రూ.18 వేల కోట్లు రుణమాఫీ చేశామన్నారు. రేషన్ కార్డులు లేని 4 లక్షల మంది రైతులకు కుటుంబ నిర్ధారణ ముగిసినందున దీపావళికి ముందే వారికి కూడా రుణమాఫీ చేస్తామన్నారు. ఆర్థిక సమస్యలున్నా ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో లక్షా యాభై వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందని, ఐకేపీ కేంద్రాల్లో సన్న రకం ధాన్యానికి రూ.5 వందల బోనస్ చెల్లించి కొనుగోలు చేస్తామని తెలిపారు. రైతులు సాగు చేస్తున్న పంటలకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి పంటల బీమాను అమలు చేస్తుందన్నారు. ఆయిల్ పామ్ సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 2 లక్షల ఎకరాల్లో సాగు చేస్తుండగా దానిని 10 లక్షల ఎకరాలకు విస్తరించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి శ్రీశైలం సొరంగమార్గం పనులను రెండేండ్లలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ముకుందాపురం నుంచి తుమ్మడం మీదుగా అల్వాల క్రాస్ రోడ్డు వరకు రోడ్డు నిర్మాణానికి రూ.70 కోట్లు మంజూరు చేశామన్నారు. జిల్లాలో రోడ్ల అభివృద్ధికి ఇప్పటి వరకు రూ.516 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రూ.150 కోట్లతో ప్రతి నియోజకవర్గంలో 25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మిస్తామని పేర్కొన్నారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేసిన మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం, పాలకవర్గ సభ్యులకు మంత్రులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, సీఎల్‌పీ మాజీ నాయకుడు కుందూరు జానారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, నాయకులు యడవల్లి రంగశాయిరెడ్డి, కొండేటి మల్లయ్య, యడవల్లి వల్లభ్‌రెడ్డి, మేరెడ్డి వెంకట్‌రెడ్డి, ముంగి శివమారయ్య, అంకతి వెంకటరమణ, ఉన్నం చిన్నవీరయ్య, యడవల్లి నరేందర్‌రెడ్డి, గండికోట యాదగిరి, పగిళ్ల శివ, మంజులా శ్రీనివాస్ పాల్గొన్నారు.

హాలియా వ్యవసాయ మార్కెట్ పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవం

హాలియా : స్థానిక లక్ష్మీనర్సింహగార్డెన్స్‌లో హాలియా వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రు లు తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు చేపట్టిన మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు బాధ్యతగా రైతులకు సేవ చేయాలని సూచించారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా కాల్సాని చంద్రశేఖర్‌తో పాటు డైరెక్టర్లను మంత్రులు అభినందించారు. కార్యక్రమంలో డివిజన్ సబ్ కలెక్టర్, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, కాకునూరి నారాయణ, కుందూరు వెంకట్‌రెడ్డి, చింతల చంద్రారెడ్డి, గౌని రాజారమేశ్ యాదవ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పెద్దవూర : మండలంలో పలు అభివృద్ధి పనులకు బుధవారం రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు శంకుస్థాపన చేశారు. రూ.11కోట్లతో మండలంలోని పెద్దగూడెం స్టేజీ నుంచి అన్నారం రోడ్డు వరకు రహదారి నిర్మాణానికి, రూ.22 కోట్లతో వెల్మగూడెం – గుర్రంపోడు మండలం చేపూరు వరకు రోడ్డు వెడల్పు, పటిష్టపర్చే పనులకు మంత్రులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, ఎంపీ రఘువీర్ రెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, మాజీ జడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి, నాయకులు పబ్బు యాదగిరి, గడ్డంపల్లి వినయ్‌రెడ్డి, చామల సువర్ణ, మల్లారెడ్డి, దామోదర్‌రెడ్డి, ధర్మారెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ యాకుబ్, ఎస్‌ఈ సత్యనారాయణరెడ్డి, డీఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు ఎంజీయూలో బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

రామగిరి, అక్టోబర్ 16 : పురుషుల బ్యాడ్మింటన్ సౌత్‌జోన్ అంతర యూనివర్సిటీ జట్ల ఎంపిక పోటీలను ఈ నెల 17న నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో నిర్వహిస్తున్నట్లు యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి హరీశ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17 నుంచి 25 సంవత్సరాల లోపు వయసున్న వారు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న క్రీడాకారులు తాము చదివే కళాశాలల నుంచి బోనఫైడ్ సర్టిఫికెట్, కళాశాల ఐడీకార్డుతో ఉదయం 8:30 వరకు వర్సిటీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో హాజరు కావాలని కోరారు.

వీరారెడ్డి మృతికి ఎమ్మెల్యే వీరేశం సంతాపం

కేతేపల్లి, అక్టోబర్ 16 : మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు ముదిరెడ్డి వీరారెడ్డి అనారోగ్యం మంగళవారం రాత్రి మృతి చెందారు. స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం బుధవారం ఆయన ఇంటికి వెళ్లి వీరారెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, నాయకులు దైద రవీందర్, మాజీ సర్పంచ్ జటంగి ముత్తమ్మ ఉన్నారు.

జేబు దొంగల హల్‌చల్

నిడమనూరు, అక్టోబర్ 16 : మండల కేంద్రంలోని బాలాజీ గార్డెన్‌లో బుధవారం జరిగిన వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో జేబు దొంగలు హల్ చల్ చేశారు. మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీ హాజరు కావడంతో కాంగ్రెస్ కార్యకర్తలు, స్థానికులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఇదే అదనుగా భావించిన జేబు దొంగలు కాంగ్రెస్ నాయకుల జేబులు కత్తిరించారు. కాంగ్రెస్ నాయకుడు కొండా శ్రీనివాస్‌రెడ్డి జేబులోంచి రూ.9,500, శాఖాపురం మాజీ ఉప సర్పంచ్ కాసోజు తిరుపతయ్య చారి జేబులోంచి రూ.15 వేలు కాజేశారు. దాంతో పాటు మరి కొందరు నాయకులు, కార్యకర్తల జేబులు కూడా కత్తిరించినట్లు తెలిసింది. మంత్రులు పాల్గొన్న కార్యక్రమంలోనే దొంగలు తమ చేతివాటం చూపడంతో ఖంగు తినడం కాంగ్రెస్ నాయకుల వంతైంది.

బీఈడీ ఫైనల్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం

రామగిరి, అక్టోబర్ 16 : ఎంజీయూ పరిధిలో ఉన్న బీఈడీ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఫైనల్ టీచింగ్ ప్రాక్టీస్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 17తో గ్రూప్– ఏ కళాశాలలకు పరీక్షలు ముగియనున్నాయి. గ్రూప్ –బీ కళాశాలలకు ఈ నెల 18, 19 తేదీల్లో పరీక్షలు నిర్వహించాలని పరీక్షల విభాగం అధికారి జి. ఉపేందర్‌రెడ్డి వెల్లడించారు.

ప్రవల్లికకు ఓయూ డాక్టరేట్

రామగిరి, అక్టోబర్ 16 : నల్లగొండకు చెందిన దర్శనం ప్రవల్లికకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్(పీహెచ్‌డీ) అందించింది. ఓయూలోని ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్‌లో కోటి ఉమెన్స్‌కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ బాల రత్నకుమారి పర్యవేక్షణలో 'తెలంగాణలో చేనేత కార్మికుల సామాజిక – ఆర్థిక స్థితి' అనే అంశంపై పరిశోధన చేసి గ్రంథాన్ని సమర్పించడంతో ఆమెకు ఓయూ డాక్టరేట్ అందించింది. ప్రవల్లికను కుటుంబ సభ్యులతోపాటు స్నేహితులు అభినందించారు.

నేటి నుంచి లతీఫుల్లా షా ఖాద్రి ఉర్సు

ఉర్సుకు ముస్తాబైన దర్గా ప్రాంగణం

రామగిరి, అక్టోబర్ 16: నల్లగొండ జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్ సమీపంలో ఉన్న లతీఫుల్లా షా ఖాద్రి దర్గాలో ప్రతి సంవత్సరం నిర్వహించే ఉర్సు ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. అధికారికంగా ఐదు రోజులే అయినప్పటికీ అనధికారికంగా నెల రోజుల పాటు సాగే ఉత్సవాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి ప్రజలు కులమతాలకు అతీతంగా హాజరు కానున్నారు. ఉత్సవాలకు ఉత్సవ కమిటీ, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. రంగు రంగుల విద్యుత్ దీపాలతో దర్గాను, పరిసర ప్రాంతాలను అలంకరించారు. గుట్ట కింద దుకాణాలు వెలిశాయి.

గంధం ఊరేగింపుతో ప్రారంభం

గురువారం గంధం ఊరేగింపుతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. గడియారం సెంటర్ సమీపంలోని మదీనా మసీదులో ప్రత్యేక ప్రార్థనల అనంతరం సాయంత్రం 5.30 గంటలకు గంధం ఊరేగింపు ప్రారంభిస్తారు. ఊరేగింపు పట్టణ ప్రధాన వీధుల గుండా దర్గా మెట్ల వరకు చేరుకున్న అనంతరం ముస్లిం మత పెద్దలు, దర్గా ముతవల్లీలు గంధాన్ని గుట్టపైకి తీసుకెళ్లి దర్గాలో ఉంచుతారు. రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా కలెక్టర్, ఎస్పీతో పాటు ప్రజాప్రతినిధులు గంధం కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఉర్సులో భాగంగా ఈ నెల 19వ తేదీ రాత్రి ఖవ్వాలి కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయానికి పుస్తకాల అందజేత

జడ్పీ సీఈఓకు పుస్తకాలను అందిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

రామగిరి, అక్టోబర్ 16: జిల్లా కేంద్రంలోని గ్రంథాలయం, జిల్లా పరిషత్ స్టడీ సర్కిల్‌లో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ సహకారంతో రూ.1.20లక్షల విలువైన పుస్తకాలను రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అందించారు. ఈ పుస్తకాలను బుధవారం తన క్యాంపు కార్యాలయంలో జడ్పీ సీఈఓ నంద్యాల ప్రేమ్‌కరణ్‌రెడ్డి, జిల్లా కేంద్ర గ్రంథాలయం లైబ్రరియన్ కట్టా నాగయ్యకు మంత్రి అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సీఈఓ ఎంవీ గోనారెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కొలనుపాక రవికుమార్, గుమ్ముల మోహన్‌రెడ్డి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు కూలీ మృతి

మిర్యాలగూడ రూరల్, అక్టోబర్16 : విద్యుదాఘాతంతో మండలంలోని ఎర్రావులపాడ్ గ్రామానికి చెందిన పరిక గోపాల్ (44) బుధవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోపాల్ వ్యవసాయ కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన నామ అరుణ్‌కు చెందిన వ్యవసాయ బావి వద్ద మోటరు పని చేయకపోవడంతో కొంత మేరకు అవగాహన ఉన్న గోపాల్‌ను తీసుకెళ్లాడు. మోటరును పరిశీలించిన గోపాల్ కరంటు సప్లయ్ కాకపోవడంతో ట్రాన్స్‌ఫార్మన్ వద్దకు వెళ్లి ఫీజు వేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గ్రామస్తులు మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. గోపాల్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లోకేశ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

మిర్యాలగూడ, అక్టోబర్ 16: ఆగిఉన్న వాహనాన్ని ఢీకొట్టడంతో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన పట్టణంలోని ఏడుకోట్లతండా వద్ద బుధవారం చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం.. నర్సారావుపేటకు చెందిన బండారు హరిబాబు బైక్‌పై హైదరాబాద్‌కు బయల్దేరాడు. ఏడుకోట్లతండా వద్ద హైవే పనులు నిర్వహిస్తున్న సిబ్బంది తమ రోడ్డుపై వాహనాన్ని, డివైడర్లు అడ్డంపెట్టి పనులను నిర్వహిస్తున్నారు. దీనిని గమనించని హరిబాబు వేగంగా వచ్చి ఆపి ఉన్న వాహనాన్ని ఢీకొట్టాడు. అతడి నుదిటిలో ఐరన్ రేకు దిగడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. హరిబాబు పరిస్థితి విషమంగా ఉండడంతో బాధితుడి కుటుంబానికి సమాచారం అందించారు. వారు వచ్చి అంబులెన్స్‌లో అతడిని నర్సారావుపేటకు తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ విషయమై తమకు ఫిర్యాదు అందలేదని సీఐ తెలిపారు.

ఆర్థిక సాయం

చందంపేట, అక్టోబర్ 16 : మండలంలోని ముదుదండ్ల గ్రామానికి చెందిన నరందాసు బుచ్చయ్య ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి బుధవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట నాయకులు ఆమనగంటి శ్రీధర్‌రావు, ఇప్ప గోపాల్‌రెడ్డి, దామెర శ్రీను, రఘుమారెడ్డి, నిరంజన్, నర్సింహ, యాదయ్య, ఇద్దయ్య, సాయిబాబా, రామలింగం, శ్రీను, అంజయ్య పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా రాజశేఖర్‌నాయక్

మిర్యాలగూడటౌన్, అక్టోబర్16: బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా మిర్యాలగూడకు చెందిన రాజశేఖర్‌నాయక్‌ను నియమించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి బుధవారం నాయక్‌కు నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం పోరుబాట

జిల్లా కేంద్రంలో డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల ర్యాలీ, ధర్నా

ధర్నా నిర్వహిస్తున్న ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు

రామగిరి, అక్టోబర్ 16: పెండింగ్‌లో ఉన్న ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల్లో చదివే విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని కోరుతూ ఈ నెల 14 నుంచి కళాశాలల బంద్ పాటిస్తున్న తెలంగాణ అఫ్లియేటెడ్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్(టీపీడీపీఎంఏ) సభ్యు లు బుధవారం జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లాలోని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల నుంచి రామగిరి మీదుగా గడియారం సెంటర్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం గడియారం సెంటర్‌లో ధర్నా చేపట్టారు. వీరికి ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మారం నాగేందర్‌రెడ్డి మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో అప్పులు తెచ్చి కళాశాలల నిర్వహణ చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే మంత్రులు, ప్రిన్సిపల్ సెక్రెటరీతోపాటు అన్ని యూనివర్సిటీల రిజిస్ట్రార్స్‌కు మొరపెట్టుకున్నా స్పందన లేకపోవడంతోనే నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. నల్లగొండలోని ఎంజీయూ పరిధిలో ఉన్న డిగ్రీ, పీజీ కళాశాలలు బంద్ పాటిస్తున్నట్లు చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత బకాయిలు చెల్లించి ఆదుకుంటామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. అధికారంలోకి వచ్చి 10నెలలు గడిచినా విద్యార్థుల ఉపకారవేతనాలు, బోధనీ రుసుములు చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తుందని పేర్కొన్నారు. పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే బకాయిలను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల యాజమాన్యాలు కక్కిరేణి రాంమోహన్, నర్సింహారెడ్డి, గుండెబోయిన జానయ్యయాదవ్, సత్యం గౌడ్, ప్రవీణ్, హనుమంతు, ఎం.వెంకట్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలని సీఎంకు ఉత్తరాలు

ఉత్తరాలు పోస్ట్ చేస్తున్న బీసీ సంఘం నాయకులు

మిర్యాలగూడ, అక్టోబర్ 16: బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ ఆధ్వర్యంలో బుధవారం సీఎం కార్యాలయానికి ఉత్తరాలు పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి అనేక మంది పేద విద్యార్థులు చదువుకుంటున్నారని పేర్కొన్నారు. వాటిని విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నారని, దాంతో వారి చదువు మధ్యలో ఆగిపోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎర్రవెల్లి గంగాధర్, రాయించు నరసింహ, చిలకల మురళీయాదవ్, మహేశ్వరం నరేశ్, శైలేందర్, రాములు, సైదానాయక్ పాల్గొన్నారు.

విధుల్లో చేరిన కొత్త టీచర్లు

• జిల్లా వ్యాప్తంగా 535 మంది

త్రిపురారం : విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు ఉత్తర్వులు అందిస్తున్న ఎంఈఓ రవినాయక్

రామగిరి, అక్టోబర్ 16: డీఎస్సీ–2024లో టీచర్ ఉద్యోగం సాధించిన అభ్యర్థులు బుధవారం విధుల్లో చేరారు. నల్లగొండ జిల్లాలో 535 మంది వివిధ కేటగిరీల్లో ఎంపికై మంగళవారం విద్యాశాఖ నిర్వహించిన కౌన్సిలింగ్‌లో నియామక పత్రాలు అందుకున్న సంగతి తెలిసిందే. వారంతా బుధవారం ఆయా మండల కేంద్రాలకు చేరుకుని ఎంఈఓలు, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లకు రిపోర్ట్ చేశారు. తమకు కేటాయించిన బడుల్లో చేరి బాధ్యతల్లో నిమగ్నమయ్యారు.

ఘనంగా పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ

పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్, అక్టోబర్ 16 : మండలంలోని తాటికల్ గ్రామంలో ముదిరాజ్‌ల కులస్తుల ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొని ప్రత్యేక పూజ లు నిర్వహించారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పెండెం సదానందం, మాజీ ఎంపీటీసీలు గుర్రం గణేశ్, రాచకొండ వెంకన్న, కౌన్సిలర్ పల్లె విజయ్, స్థలదాత ముచ్చపోతుల జానయ్య, కమిటీ సభ్యులు బంటు రవి, రామలింగం, జానయ్య పాల్గొన్నారు.

అలరించిన అన్నమాచార్య సంకీర్తనలు

అన్నమాచార్య సంకీర్తనలు ఆలపిస్తున్న రమణమ్మ

నల్లగొండ రూరల్,అక్టోబర్ 16: అన్నమాచార్య ప్రచార సమితి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలోని రామగిరి సీతారామచంద్రస్వామి ఆలయ ఆవరణంలో 514వ అన్నమాచార్య సంకీర్తన నిర్వహించారు. ఈ సందర్భంగా రాపోలు రమణమ్మ ఆలపించిన సంకీర్తనలు సంగీత ప్రియులను అలరించాయి. సంకీర్తనలు ఆలపించిన రమణమ్మను నిత్య యోగా సాధకులు ఘనంగా సత్కరించారు. కీబోర్డు ఎం.లక్ష్మీనారాయణరావు, తబల జయప్రకాశ్, రిథమ్స్ కె.భిక్షం, వ్యాఖ్యానం శ్రీనివాస్ చేయగా కార్యక్రమంలో పురుశోత్తమాచార్యులు, రాపోలు వెంకటేశ్వర్లు, రుత్విక పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

చెక్కు అందిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ జయరాంనాయక్

త్రిపురారం, అక్టోబర్ 16: ఖమ్మం జిల్లాలోని వరద బాధితులకు త్రిపురారం పీఏసీఎస్ తరపున రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందించారు. బుధవారం మండల కేంద్రంలోని సహకార సంఘం బ్యాంక్ మేనేజర్ స్వచ్ఛ భారతికి చైర్మన్ జయరాంనాయక్ రూ.10వేల చెక్కును అందచేశారు. కార్యక్రమంలో సీఈఓ నర్సయ్య, డైరెక్టర్లు వెంకట్‌రెడ్డి, సైదానాయక్, సైదులు, అలివేలు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగ మహిళలకు జీవన భృతి అందించాలి : ఐద్వా

త్రిపురారం, అక్టోబర్ 16: రాష్ట్రంలోని నిరుద్యోగ మహిళలకు ప్రభుత్వం జీవనభృతి అందించాలని ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు దైద జానకమ్మ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం మండల మహాసభలో ఆమె మాట్లాడారు. ఎన్నికల సమయంలో మహిళలకు అనేక హామీలిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఫ్రీ బస్సు తప్ప మిగతా వాటిని అమలు చేయలేదన్నారు. వంటగ్యాస్ సబ్సిడీని అందరికీ వర్తింపజేయాలని, మహిళలపై దాడులను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం ఐద్వారా మండల అధ్యక్షురాలిగా చంద్రకళ, కోశాధికారిగా చందనబోయిన రాములమ్మ, కార్యదర్శిగా దైద జానకమ్మ, సభ్యులుగా లింగమ్మ, బుజ్జమ్మ, లచ్చమ్మ, హుసేనమ్మ, నవనీత, అంజమ్మను ఎన్నుకున్నారు.